క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల (సిటీ): పట్టణంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా పేర్కొన్నారు. సోమవారం శిల్పా నగర్, రైతు నగర్ ప్రాంతాల్లో రూ.80 లక్షలతో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి సోమవారం భూమి పూజ చేశారు.

త్వరలో లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు

చాగలమర్రి: మండలంలోని దళితులకు గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేసిన వ్యవసాయ భూమికి భూహక్కు పత్రాలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అందజేయనుందని ఎస్సీ కార్పొరేషన్ సీనియర్ సహాయకులు గంగాధర్ ఆచారి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీటీ విజయ్ కుమార్‌తో భూమి పొందిన దళిత లబ్ధిదారుల జాబితాను పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన వ్యవసాయ భూమికి ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో మార్ట్‌గేజ్ చేయబడిందన్నారు. ప్రభుత్వం భూహక్కు పంపిణీ కార్యక్రమంలో భాగంగా మార్ట్‌గేజ్‌ను తొలగించి లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి అందజేస్తుందని చెప్పారు. పెద్ద బోధనంలో 27మంది, మల్లెవేములలో 4, రాంపల్లెలో 3, చిన్న బోధనంలో 3, చాగలమర్రిలో 1 లబ్ధిదారులు ఉన్నారని వివరించారు.

టీకాల కార్యక్రమం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ రవికాంత్

శిరివెళ్ల: శిరివెళ్ల, గోవిందపల్లెలో జరుగుతున్న ప్రత్యేక వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ మిషన్ ఇంద్రధనస్సు మానిటరింగ్ అధికారి డాక్టర్ రవికాంత్ సోమవారం పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలు, కార్యక్రమం అమలుపై డాక్టర్లు దివ్య, ముఖేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో డోన్, ప్యాపిలితో పాటు పది మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ సోమన్న కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వామపక్ష, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కరువు మండాలల ప్రకటనపై ఈనెల 14వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లానరసింహ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతలయ్య, న్యూడెమోక్రసీ నాయకులు రఫీ, సోహేల్‌రాణా, ధనుంజయుడు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక చికిత్స అందించాలి

నంద్యాల టౌన్: గర్భధారణ సమయం నుంచి గర్భిణులకు ప్రత్యేక చికిత్సలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక ఎంసీహెచ్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లకు గర్భిణులకు అందించాల్సిన ప్రత్యేక చికిత్సలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణులకు వేయాల్సిన టీకాలు, రక్త హీనత కలుగకుండా తీసుకోవాల్సిన ఆహారం, శిశువు ఆరోగ్యమైన ఎదుగుదలకు పాటించవలసిన నియమాలు తదితర విషయాల గురించి వివరించారు. కో-ఆర్డినేటర్ జగదీష్ చంద్రరెడ్డి, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సచివాలయాలకు చేరిన క్రీడా సామగ్రి



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని ఆయా గ్రామ సచివాలయాలకు తరలించినట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి క్రీడాకారుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. ఒక్కో సచివాలయానికి 220 మంది క్రీడాకారులను దరఖాస్తులు చేయించాలని నిర్దేశించగా మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని సిబ్బంది 90 శాతం చేయించారని చెప్పారు. పోటీలకు సమయం ఆసన్నమవుతుండటంతో క్రీడా కారులకు అవసరమైన సామగ్రిని ఆయా గ్రామ సచివాలయాలకు తరలించామని వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(సిటీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఆయా సంఘాల రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కారించాలని ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయనున్నామన్నారు.



రుద్రవరంలో స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు



నాగలింగేశ్వర ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న మహిళలు



నంద్యాలలో భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం



పడిగెపాడు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

- వైభవంగా కార్తీకమాస చివరి సోమవారం పూజలు
- భక్త జనంతో కిటకిటలాడిన కాచింతల
- పలు చోట్ల సామూహిక వనభోజనాల ఏర్పాటు



ఆళ్లగడ్డలో సామూహిక వనభోజనంలో పాల్గొన్న భక్తులు



నంద్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి



నంద్యాలలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పట్టణంలోని శైవాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులు అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకాలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో భక్తులు సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సంజీవనగర్ రామాలయం, కోటావీధిలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయాల్లో సామూహిక లక్ష బిల్వార్చన, స్ఫటిక లింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం, టెక్కె నాగలింగేశ్వర , కాళికాంబ, నాగనందీశ్వరస్వామి, సోమనందీశ్వర, ప్రథమనందీశ్వర, బ్రహ్మనందీశ్వర ఆలయాల్లో, అమ్మవారి శాలలోని శ్రీనగరేశ్వర స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు బిల్వార్చన, సామూహిక కుంకుమార్చన జరిపించారు. కోటావీధిలోని సీతా రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. రమా సమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో 24గంటల క్షీరాభిషేకం చేపట్టారు.

ఆళ్లగడ్డ: కార్తీక మాసం చివరి సోమవారంను పురస్కరించుకొని నియోజకవర్గంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ శివారులోని కాచింతల క్షేత్రం తెల్లవారు జామునుంచే భక్త కోటితో ఉప్పొంగి పోయింది. క్షేత్రం సమీపంలోని వక్కిలేరు వాగులో పుణ్య స్నానాలు ఆచరించేందుకు పట్టణంతోపాటు సమీపంలోని గ్రామాల మహిళలు వేకువజాము నుంచే బారులు తీరారు. అనంతరం కాశీవిశ్వేరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర సమీపంలోకి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ వర్గాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి పాలాభిషేకం చేశారు. అనంతరం సామూహిక వనభోజన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి ఉన్నారు. కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అహోబిళం రహదారిలోని పడకండ్ల క్రాస్ రోడ్డు, నంద్యాల రహదారిలోని 18వ జాతీయ రహదారిలోని ప్రభుత్వ గోదాముల క్రాస్ రోడ్డు నుంచి దాదాపు 4 కి.మీ. మేర ఇసుకేస్తే రాలనంత భక్త జనం కనిపించారు. డీఎస్పీ వెంకట్రామయ్య పర్యవేక్షణలో సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు

రుద్రవరం: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో పోటెత్తి శివనామ స్మరణతో మారుమోగాయి. స్థానిక భాస్కర నందీశ్వర స్వామి, బలిజ పేటలోని చెన్నకేశవ, రుద్రవరం -అప్పనపల్లె దారిలో వెలసిన మానసలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఉల్లెడ మల్లేశ్వర స్వామి వారికి భక్తులు విశేష పూజలు గావించారు.ఆయా ఆలయాల్లో భక్తులకు దాతలు,ఆలయ నిర్వాహకులు కార్తీకవన భోజనాలు ఏర్పాటు చేశారు.

ఉయ్యాలవాడ: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని ఇంజేడు, పడిగెపాడు, ఉయ్యాలవాడ, హరివరం, మాయలూరు, తదితర గ్రామాల్లో మహిళలు పుణ్యసాన్నాలాచరించి శివాలయాల్లో అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వనభోజనాలు నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలో కార్తీక చివరి సోమవారం పూజలను అన్ని శివాలయాల్లో ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.క్రిష్టిపాడు శివారులోని శివాలయంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం

నంద్యాల(సిటీ): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శిల్పా సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రథమనందీశ్వర దేవస్థానంలోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో వనభోజనాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, శిల్పా నాగినిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా వనభోజనాల కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, మహిళా కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



దొర్నిపాడులో పూజల్లో పాల్గొన్న మహిళలు

కమనీయం శివపార్వతుల కల్యాణం

చాగలమర్రి: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా స్థానిక పాత శివాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామి, గంగా, పార్వతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త రామసుబ్బారెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఉదయం శివాలయంలో ఆర్యవైశ్య మహిళామండలి సభ్యుల ఆధ్వర్యంలో విష్ణు సహస్ర పారాయణం, అభిషేకం, సామూహిక ఒడిబియ్యం, శివపార్వతులకు ప్రత్యేక పూజలు, పల్లకోత్సవం నిర్వహించారు. అలాగే వనభోజన కార్యక్రమం చేపట్టారు.



నల్లమల అటవీ ప్రాంతంలో పూజలందుకున్న ఉల్లెడ మల్లేశ్వరస్వామి



చాగలమర్రిలో రామలింగేశ్వరస్వామి, గంగా, పార్వతుల కల్యాణం జరిపిస్తున్న పండితులు

అభివృద్ధిపై నోటికొచ్చినట్టు మాట్లాడొద్దు

- మాజీ మంత్రి అఖిలప్రియకు ఎమ్మెల్యే గంగుల సూచన
- మంత్రిగా ఉండి నీ గ్రామానికి రోడ్డు వేయించుకోలేకపోయావ్
- రూ.3కోట్లతో మేం వేయించాం



మోత్కలపల్లెలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, రోడ్లపై నోటికొచ్చినట్లు మాట్లాడొద్దని మాజీ మంత్రి భూమా అఖిలప్రియకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. సోమవారం మోత్కలపల్లె, యర్రగుంట్ల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పబ్లిసిటీ కోసం తమను విమర్శించడం మానుకోవాలన్నారు. ఇటీవల అఖిలప్రియ వనికినిదిన్నెలో మాట్లాడుతూ.. రోడ్లు వేయడంలేదని విమర్శించిదని, నాడు మంత్రి హోదాలో ఉండి తన సొంతూరుకు రోడ్డు వేయించలేకపోయిందని ఎద్దేవా చేశారు. తాము రూ.3 కోట్లతో రోడ్డు వేయించామని గుర్తు చేశారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో రూ.55 కోట్లతో గ్రామీణ రోడ్లు, వంతెనల నిర్మాణాలు పూర్తి చేశామని వివరించారు. అనుమానముంటే జాబితా ఇస్తాం వెళ్లి పరిశీలించుకోవచ్చని చెప్పారు. అలాగే మరో రూ. 40 కోట్ల మేరకు గ్రామీణ రోడ్ల నిర్మాణాలకు టెండర్లు పిలిచామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఏంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, బీ.అబ్దుల్ సలాం, సర్పంచు సుభహాన్, నాయకులు రమణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, బోయలకుంట్ల సర్పంచు జింకల నాగన్న పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు జరిగినవి..

ఆగస్టు నుంచి ప్రారంభించిన రోడ్లపై ఆయన మాట్లాడుతూ.. చాగలమర్రి మండలంలోని ఎన్‌హెచ్ 18 నుంచి గొట్లూరు చెంచుగూడెం నల్లావులపల్లె రూ.1.27 కోట్లతో రోడ్డు నవంబర్‌లో ప్రారంభించామన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నక్కలదిన్నె వరకు రూ. 36 లక్షలతో వేసిన రోడ్డును ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రారంభించామని చెప్పారు. దొర్నిపాడు నుంచి రాజనగరం వరకు రూ.2.27 కోట్లతో, అప్రోచ్ రోడ్డు నుంచి గాంధీ నగరం వరకు రూ.1.16 కోట్లతో, ఎన్‌హెచ్18 నుంచి కొండాపురం వరకు రూ.95 లక్షలతో, వనికినిదిన్నె, జీనేపల్లె రోడ్డు రూ. 3 కోట్లతో పూర్తి చేశామని వివరించారు.

పారదర్శకత కోసమే సోషల్ ఆడిట్

- హౌసింగ్‌లో రూ.80,441 దుర్వినియోగం
- 'ఉపాధి'లో రూ. 6,806 రికవరీ



బహిరంగ సమావేశంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : వివిధ శాఖల్లో కన్వర్జెన్సీ కింద ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు సంబంధించి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ సమావేశం నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనులకు సంబంధించి గ్రామస్థాయిలో తనిఖీ చేసిన వివరాల నివేదికను ఎస్సార్పీ కన్నారెడ్డి, డీఆర్పీలు 8 మంది సభలో చదివి వినిపించారు. ఉపాధి పథకంలో మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 657 రకాల పనులకు గాను రూ. 3,87,87,822 ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇందులో లోపాలు రూ. 6,806 వెల్లడి కాగా ఈ మొత్తాన్ని సంబంధిత శాఖ నుంచి గ్రామసభలోనే రికవరీ చేశారు. అలాగే హౌసింగ్ శాఖలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గృహాలకు బిల్లులు చెల్లింపుల్లో రూ. 80,441 దుర్వినియోగం అయినట్లు తేలింది. ఆ శాఖ అధికారులపై విచారణకు ఆదేశాలు జారీ చేశామని ప్రొసీడింగ్ ఆఫీసర్ భాస్కర్‌నాయుడు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీలు అన్వర్‌బేగం, సాంబశివరావు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, అసిస్టెంట్ జిల్లా విజిలెన్స్ అధికారిణి షబీబారాణి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అన్నదాతల జీవితాలతో ఆడుకోవద్దు

- మిర్చియార్డులో అక్రమాలంటూ విషపు రాతలు దారుణం
- మార్కెట్‌యార్డు చైర్మన్ దేరెడ్డి మహేశ్వరరెడ్డి



నంద్యాల(సెంట్రల్): అసత్యాలను ప్రచారం చేసి అన్నదాతల జీవితాలతో ఆడుకోవద్దని నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మన్ దేరెడ్డి మహేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక మిర్చి యార్డులో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఇటీవల ఈనాడు పత్రికలో ఓ బూటకపు కథనం వండి వార్చారని మండిపడ్డారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. అసత్య కథనంపై ఆయన తీవ్రంగా స్పందించారు. నంద్యాల జిల్లా రైతులు ఎండు మిర్చిని అమ్ముకోవటానికి గతంలో 300 కి.మీ. దూరంలోని గుంటూరుకు వెళ్లేవారన్నారు. దీంతో రవాణా సహా ఇతర ఖర్చులు తడిసి మోపెడయ్యేవని, ఈ బాధల నుంచి రైతాంగానికి శాశ్వత విముక్తి కల్పించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని, ఎవరు అధికారంలోకి వచ్చినా యార్డు పురోగతే లక్ష్యంగా వ్యవహరించాలని హితవు పలికారు. అసత్యాలు ప్రచారం చేయటం సరికాదని, వాటి వల్ల రైతులకు జరిగే నష్టానికి ఆ పత్రికా యాజమాన్యం బాధ్యత వహిస్తుందా అని ప్రశ్నించారు. మిర్చి యార్డు ఏర్పాటుతో ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో మిర్చి సాగు 48 వేల ఎకరాలకు చేరుకుందన్నారు. యార్డులో గుర్తింపు పొందిన వ్యాపారస్తుల వద్ద బహిరంగంగానే బేరాలు జరుగుతున్నాయని, ఇక్క డ అక్రమాలకు తావే లేదని స్పష్టం చేశారు. అనుమానముంటే ఆ పత్రిక ప్రతినిధులు యార్డుకు వస్తే నిరూపిస్తామని చెప్పారు. ఇప్పటికైనా వాస్తవాలు రాస్తే ప్రజలు ఆదరిస్తారని హితవు పలికారు.

స్పందన వినతులను వేగంగా పరిష్కరించండి



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య ఇతర జిల్లా అధికారులతో కలిసి జిల్లా నలమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14న కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జరిగిన నష్ట వివరాలపై సంపూర్ణ నివేదికలు సిద్ధం చేసి వారికి వివరించాలన్నారు. కార్యక్రమంలో 159 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారించాలని కోరారు.

పెద్దకొట్టాల, బిల్లలాపురంలో వికసిత్ భారత్

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం పెద్దకొట్టాల, బిల్లలాపురం గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ మహీధర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రీషన్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. సర్పంచ్‌లు వెంకటరాముడు, రమణమ్మ, ఎంపీటీసీలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఇబ్బందులను గుర్తించుకొని వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. ఏపీజీఎల్, ఐపీఎఫ్ లోన్స్ మంజూరు చేయాలని కోరారు. భాస్కరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మౌలిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

మధుసూదనరావుకు జాతీయ పురస్కారం

నంద్యాల టౌన్: నంద్యాలకు చెందిన ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ చిత్తులూరి మధుసూదనరావుకు భారతదేశ చెవి, ముక్కు, గొంతు వైద్యుల సంఘం లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారం ప్రకటించిందని రాష్ట్ర ఐఎంఏ పాస్ట్ ప్రెసిడెంట్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ రవికృష్ణ తెలిపారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ నందు కోల్వాడ్కర్, కార్యదర్శి డాక్టర్ కౌశల్‌షేథ్ మాట్లాడుతూ.. మధుసూదనరావు చేసిన వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి పురస్కారాన్ని అందజేస్తున్నామని తెలిపారన్నారు. పురస్కారాన్ని జనవరి 5వ తేదీన బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ సదస్సులో అందజేస్తారని చెప్పారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



28వ వార్డులో మాట్లాడుతున్న కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి



38వ వార్డులో డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు

నంద్యాల(సిటీ): పట్టణంలోని పేదల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు అన్నారు. సోమవారం 28వ వార్డులో కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి ఆధ్వర్యంలో వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మరోమారు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలన్నారు. అనంతరం వార్డులో ఈ నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అలాగే 38వ వార్డు వైఎస్సార్ నగర్‌లో కౌన్సిలర్ తూర్పునాటి సావిత్రమ్మ, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ టీ.రమణ ఆధ్వర్యంలో వార్డుకు పోదాం కార్యక్రమం చేపట్టారు. నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి సంక్షేమాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు.

విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 13వ తేదీన గొర్రెల, మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకందారుల సమస్యలపై డోన్ పట్టణంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగే సదస్సుకు పాల్గొనాలన్నారు.

జగనన్నతోనే సామాజిక సాధికారత

నంద్యాల(న్యూటౌన్): సామాజిక సాధికారత జగనన్నతోనే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పాల్గొంటారన్నారు. విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలు ప్రారంభం



త్రోబాల్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన కర్నూలు జిల్లా జట్టు

నంద్యాల(న్యూటౌన్): 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -14 త్రోబాల్ పోటీలు సోమవారం స్థానిక ఖాదరబాద్ నర్సింగరావు స్మారక పురపాలక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు అన్ని జిల్లాల నుంచి 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు బాలికల జట్టు విశాఖపట్నం జట్టును ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ పోటీల్లో చిత్తూరు జట్టుతో తలపడనుందన్నారు. అలాగే కర్నూలు బాలుర జట్టు కడప జట్టుపై గెలిచి ఫైనల్‌కు చేరిందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నంతో తలపడనుందని చెప్పారు. స్టేట్ అబ్జర్వర్ ఎర్రన్న, కుమార్‌రాజు, మధు, విష్ణు, సుబ్బారావు, శ్రీధర్ పాల్గొన్నారు.